క్లుప్తంగా

యోగా పోటీల్లో రాజకొమురయ్య ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: డ్రీమ్ యోగా అండ్ ఫిట్‌నెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మందమర్రిలో నిర్వహించిన తెలంగాణ యోగా కప్–2025 పోటీల్లో రామకృష్ణాపూర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఎమ్.రాజకొమురయ్య ప్రతిభ కనబర్చాడు. 61 నుంచి 65వయస్సు విభాగంలో ప్రథమ బహుమతిని అలాగే ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రెండో బహుమతిని సాధించాడు. స్థానిక క్రీడాకారులు రాజకొమురయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి సులభ్ కాంప్లెక్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి జాఫర్, నాయకులు, కార్మికులు శ్రీనివాస్, మల్లేష్, కనుకయ్య, వెంకటి, అప్పారావు, మహేశ్వరి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు వీసీబీ బ్రేకర్ ఏర్పాటు పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంనూర్, గుడిపేట, చందనాపూర్, ముల్కల్ల గ్రామాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌లో కోత ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలి

శ్రీరాంపూర్: గనిలో నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ నాయకులు సోమవారం ఆర్కే 5గనిని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు నాసిరకంగా ఉంటున్నాయన్నారు. నాణ్యమైన వాటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ నాయకులు మిడివెల్లి శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, తిరుపతి, బందు శ్రీను, సురేందర్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఆర్కే 6 టీం



బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీరాంపూర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీలోని శాంతి మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటీ బ్యాంకర్స్ టీంకు, ఆర్కే 6 గని టీంకు మధ్య జరిగింది. ఈ పోటీల్లో 30పరుగుల తేడాతో ఆర్కే 6 గని టీం విజేతగా గెలిచింది. దీంతో రన్నర్‌గా బ్యాంకర్స్ టీంను ప్రకటించారు. విన్నర్, రన్నర్ టీంలకు మహాలక్ష్మి చిల్డ్రన్స్ హాస్పిటల్ నిర్వాహకులు అశ్విన్ చేతుల మీదుగా బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఆర్కే 6గని టీం కెప్టెన్ విరాట్, బ్యాంకర్స్ టీం కెప్టెన్ రమేశ్‌తో పాటు నాయకులు తుల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎం బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి'


చెన్నూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎం బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్‌లను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు చందు, రంజిత్, ఉమారాణి, సమ్మక్క, కరీంబీ, రమాదేవి పాల్గొన్నారు.

దుమ్ము లేస్తోంది..?



దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ నుంచి ద్వారక వెళ్లే రోడ్డుకు బీటీ రెన్యూవల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నర్సాపూర్ సమీపంలో కొద్దిదూరం వరకు బీటీ వేసి, మరికొంత దూరం కంకర పోసి వదిలేశారు. దీంతో కంకరరోడ్డుకు రోలింగ్ చేయక పోవడంతో, రోడ్డుగుండా వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ములేస్తోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

బస్టాండ్ నిరుపయోగం



భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల్లోని బస్టాండ్‌లు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కన్నెపల్లి మండలం సబ్‌స్టేషన్ సమీపంలోని బస్టాండ్, భీమిని మండలంలోని రాంపూర్, వీగాం బస్టాండ్‌లు శిథిలావస్థకు చేరాయి. వాటి మరమ్మతులను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నెన్నెల: మండలంలోని జంగాల్‌పేట గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి బిగించిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. రోడ్డు పక్కనే చేతికందే ఎత్తులో ఉండటంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గడువులోగా పూర్తయ్యేనా?

- పశువుల షెడ్డు నిర్మాణాలకు సమీపిస్తున్న గడువు
- మంజూరైనవి 310, పూర్తయినవి 75

దండేపల్లి: ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తేనే అవి సద్వినియోగమవుతాయి. ఆ చొరవ దూరమైతే, తమకు సంబంధించిన ఓ పథకం ఉందన్న విషయమే గ్రామీణులకు తెలియదు. నిధుల విడుదలలో నిబంధనలూ, క్షేత్రస్థాయిలో నిర్మాణాల పురోగతికి ప్రధాన ప్రతి బంధకాలుగా మారుతున్నాయి. ఈ రెండు సమస్యలూ ఉపాధిహామీ పథకంలో భాగంగా అమలవుతున్న పశువులషెడ్డు (క్యాటిల్‌షెడ్లు)నిర్మాణాలకు వర్తిస్తుంది. పథకం పాతదే, కానీ చెప్పేవారు లేరు. అవగాహనా రాహిత్యంతో దరఖాస్తులే చాలా తక్కువగా వస్తున్నాయనుకుంటే, అందులో పనులు ప్రారంభిస్తున్నవి, పూర్తవుతున్నవీ తక్కువ సంఖ్యలో ఉంటున్నాయి. లక్ష్యసాధనలో ముందుకెళ్లే దిశగా అధికార యంత్రాంగం ప్రయత్నాలూ చేస్తున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగింపునకు వస్తున్నా, పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తికావడం లేదు. జిల్లాలో పశువుల షెడ్ల నిర్మాణంపై 'సాక్షి' ప్రత్యేక కథనం...

జిల్లాలో నిర్మాణాల తీరు..

మంచిర్యాల జిల్లాలోని 16మండలాలు, 311గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకం ద్వారా 310పశువుల షెడ్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటివరకు 75మాత్రమే పూర్తయ్యాయి. 235నిర్మాణంలో ఉన్నాయి.



రెబ్బనపల్లిలో పూర్తయిన పశువుల షెడ్డు

పశువుల పాకల నిర్మాణాలకు నిబంధనలు..

ఉపాధిహామీ పథకంలో నిర్మించే పశువుల పాకల నిర్మాణాలకు నిబంధనలు విధించారు. షెడ్డు మంజూరుకు ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉండాలి. నిరుపేద కూలీ కుటుంబాలు, సన్న, చిన్నకారు రైతులు మాత్రమే అర్హులు. నాలుగెకరాల లోపు భూమి, తప్పనిసరిగా 3పశువులు ఉండాలి. నిర్మాణానికి స్థలం ఉండాలి. గ్రామసభ తీర్మానం అవసరం. షెడ్డు నిర్మాణానికి రూ.85వేలు మంజూరు చేస్తారు. అందులో స్కిల్, సెమీస్కిల్, అనుస్కిల్డ్ వేజ్, ఇతర ఖర్చులు కలుపుకొని సుమారుగా రూ.30వేలు చెల్లించగా, మెటీరియల్ కింద రూ.55వేలు చెల్లిస్తారు. నిర్మాణం పూర్తయ్యాక మొత్తం చెల్లిస్తారు.

షెడ్డు నిర్మాణం ఇలా..

మూడు వైపులు, తొమ్మిది ఇంచులతో ఇటుక గోడ గది. అందులో పశువులకు గడ్డి వేసేందుకు ఇటుక గోడతో కట్టిన గాడి. పశువుల మలవిసర్జనకు సిమెంటు గాజులతో ఏర్పాటు చేసిన లీచ్‌ఫిట్, షెడ్డు బయట ఇటుకతో నిర్మించిన నీటి తొట్టి. పైకప్పు నీలిరంగు జీఐ రేకులు, రేకుల కింద ఎమ్మెస్ పైపులు, ఇటుక గోడకు ప్లాస్టరింగ్, వైట్‌వాష్, నేమ్‌బోర్డు తప్పనిసరి పాటించాలి.

మార్చి15 కల్లా పూర్తి చేస్తాం

ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాకు మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలు మార్చి 15లోగా పూర్తిచేస్తాం. ఇప్పటికి కొన్ని పూర్తయ్యాయి. కొన్ని నిర్మాణాలు సాగుతున్నాయి. ఇంకా ఎవరైన అర్హత కలిగి, ఆసక్తి గల రైతులు, రైతు కూలీలు ఎవరైనా ఉంటే మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోకు దరఖాస్తు చేసుకుంటే షెడ్డు మంజూరు చేస్తాం.

– కిషన్, డీఆర్‌డీవో, మంచిర్యాల

స్వయం ఉపాధి యూనిట్లు జిల్లాకే ఆదర్శంగా నిలువాలి

- డీఆర్‌డీవో కిషన్



అజోల్లపిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కిషన్

నెన్నెల: మండలంలోని స్వయం ఉపాధి యూనిట్లు జిల్లాకే ఆదర్శంగా నిలిచేలా స్థానిక అధికారులు కృషి చేయాలని డీఆర్‌డీఓ కిషన్ అన్నారు. మండలంలోని నందులపల్లి, మన్నెగూడం గ్రామాల్లో సెర్ప్ రుణాలతో ఏర్పాటు చేసిన పెరటికోళ్ల పెంపకం యూనిట్లు, అజొల్ల ఫిట్‌లు, పశువుల పాకల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. యూనిట్లు నెలకొల్పేందుకు రుణ సాయంతో పాటు లాభాలు పొందేలా వారికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సెర్ప్ రుణాలు కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావడానికి, మహిళల అభ్యున్నతికి ఉపయోగపడుతాయన్నారు. అనంతరం మన్నెగూడంలో ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న స్కూల్ కంపోండ్‌వాల్ , పశువుల పాకల పనులను పరిశీలించారు. పనులను మార్చి 10వ తేదీలోగా పూర్తి చేసి బిల్లులు చెల్లించాలన్నారు. వ్యవసాయ అభివృద్ధి కోసం చేపడుతున్న ఉపాధిహామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్, ఏపీఎం విజయలక్ష్మి ఉన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు



చెన్నూర్: స్థానిక ప్రభుత్వ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈవో అంజయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదివి స్టేట్ ర్యాంకులు సాధించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ నాగచందర్‌రావు, కిష్టంపేట, ఎస్పీ వాడ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు గోపాల్, స్టాఫ్ క్లబ్ సెక్రెటర్ శ్రీకాంత్‌శర్మ పాల్గొన్నారు.

గెలిస్తే సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

బెల్లంపల్లి/శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా నాయకులు వెరబెల్లి రఘునాథ్‌రావుతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో, శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనిపై, బెల్లంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. బెల్లంపల్లి తాఫీ సంఘ భవనంలో బీజేపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో విజయం కోసం సహకరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, ప్రధాన కార్యదర్శి రజనీష్‌జైన్, పి.కృష్ణ, జిల్లా కేంద్రంలో పెద్దపల్లి పురుషోత్తం, ముల్కల్ల మల్లారెడ్డి, ఆకుల అశోక్‌వర్ధన్, అమిరిశెట్టి రాజ్ కుమార్, కంకణాల సతీశ్, శ్రీరాంపూర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, బద్రి శ్రీకాంత్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

చెన్నూర్/భీమారం/శ్రీరాంపూర్: సీఎం రేవంత్‌రెడ్డి సభ నేపథ్యంలో చెన్నూర్, భీమారం, శ్రీరాంపూర్ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో షఫీయొద్దిన్, రెవెల్లి మహేశ్, బుర్ర రాకేశ్, మహేందర్, దాసరి మధునయ్య, మణిదీప్, కుమ్రే సాగర్, వడ్లకొండ పవన్, పంబాల ఎర్రయ్య, ఎండీ రఫీక్‌ఖాన్‌లు ఉన్నారు.

విద్యార్థికి నగదు పురస్కారం

మంచిర్యాలఅర్బన్: స్థానిక నారాయణ హైస్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్న విహన్‌రామ్‌కు సోమవారం హైదరాబాద్‌లో నారాయణ పాఠశాలల యాజమాన్యం రూ. 50వేల నగదు పురస్కారం అందజేసింది. మార్చిలో ఆస్ట్రేలియా ఖండంలోని కోసియాస్కో పర్వతాన్ని అధిరోహించేందుకు వెళ్లనున్న నేపథ్యంలో పాఠశాల మేనేజ్మెంట్ తరపున నగదు అందజేశారు.

సీఎం సభకు తరలిన పట్టభద్రులు

బెల్లంపల్లి/కాసిపేట: మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న బహిరంగ సభకు బెల్లంపల్లి, కాసిపేట నుంచి పట్టభద్రులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు పట్ట భద్రులను సమీకరించి ప్రత్యేక వాహనాల్లో తీసుకువెళ్లారు.

కుటుంబ భరోసా చెక్కు అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి పాతబస్టాండ్ ఏరియాకు చెందిన ఫొటో, వీడియోగ్రాఫర్ అడిచెర్ల మహేశ్ అనారోగ్యంతో గతేడాది ఆగస్టు 27న మృతి చెందాడు. రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ప్రవేశపెట్టిన కుటుంబ భరోసా పథకం ద్వారా రూ.1.60లక్షలు, సంఘం తరపున వసూలు చేసిన రూ.30వేలు మొత్తం రూ.1.90లక్షల చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దండేపల్లి: ఇటీవల మందమర్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో లింగాపూర్ మోడల్‌స్కూల్ విద్యార్థులు మానస, సిరిచందన, అక్షయ, నిక్షిత, సహస్ర, శ్రీఅచ్చిత, సాయిఅక్షిత, అనూష ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రమేష్, కరాటే మాస్టర్ అంజన్న తెలిపారు.

ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని వినతి

లక్సెట్టిపేట: మండలంలోని నిరుపేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆధ్యాత్మికం

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ వేడుకల్లో అర్చకుడు భట్రాచార్యులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. హోమం, బలిహరణం, వేదపారాయణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో ముక్తారవి, అర్చకుడు భట్టాచార్యులు, నరహరిశర్మ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సన్యాసుల మఠం దేవాలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మహాశివరాత్రి జాతర ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు పచ్చని పందిళ్ల కార్యక్రమం, రెండో రోజు మఠంలోని శివుడి వద్ద పూజారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

నేడు విశ్వేశ్వరాలయంలో ఉత్సవ విగ్రహ ప్రతిష్టాపన

వేమనపల్లి: మండల కేంద్రంలోని అన్నపూర్ణ సమితి విశ్వేశ్వరాలయంలో మంగళవారం ఉత్సవ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గాడిపల్లి మధుకర్ స్మారకార్థం 26న శివపార్వతుల కల్యాణం జరుపనున్నారు.

రాముని చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వాకర్స్

మంచిర్యాలటౌన్: అర్ధంతరంగా నిలిచిపోయిన రామునిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను వెంటనే పునఃప్రారంభించాలని కోరుతూ రామునిచెరువు వాకర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామునిచెరువులో దుర్గంధ పూరిత వాసన వస్తుందని, మురుగు నీటిని బయటకు ఎత్తిపోయాలని, చెరువులోని పూడిక మట్టిని తొలగించాలని కోరారు. హైటెక్‌సిటీ, జాఫర్‌నగర్‌ల నుంచి వస్తున్న డ్రెయినేజీ నీరు రాముని చెరువులోకి కలువకుండా చేసి, వాకింగ్ ట్రాక్ చుట్టూ పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. చెరువు ఆవరణలో చిల్డ్రన్స్‌పార్క్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, మహిళా వాకర్స్ సభ్యుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేసి, పోచమ్మ గుడి సమీపంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు బూర్ల జ్ఞాని, కార్యదర్శి పూదరి నర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాధాకృష్ణ, సలహాదారులు రాలబండి రాజన్న, ఆర్.శంకర్, కె.రాజేందర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. | వేలాడుతున్న విద్యుత్ తీగలు!



దండేపల్లి: మండలంలోని కొండాపూర్ సమీపంలో కొండాపూర్-కాసిపేట రోడ్డు పక్కన పత్తిచేనులో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. అటుగా వెళ్లే రైతులకు తగిలేలా ఉన్నాయి. ప్రమాదం జరగకముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వేలాడుతున్న తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: బాపు, విద్యుత్ శాఖ ఏఈ ఫోన్ నంబర్ : 94408 11718

పనుల్లో నాణ్యతాలోపం

- అధికారుల పర్యవేక్షణ కరువు
- రాజకీయ నాయకులే కాంట్రాక్టర్లు

మందమర్రిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ, ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ, కాలువలు, రోడ్ల నిర్మాణం, పౌల్ట్రీషెడ్లు, పశువులపాక తదితర పనులు సాగుతుండగా.. అధికారుల పర్యవేక్షణ కరువైంది. రాజకీయ పార్టీల నాయకులే కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తుండడంతో నాణ్యత లోపిస్తోందనే ఆరోపణలున్నాయి. పనులు జరిగే సమయంలో సంబంధిత అధికారి, వర్క్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో వాటర్ క్యూరింగ్ చేయకపోవడం, నాణ్యత లేని ఇసుక వినియోగం, నిర్దేశించిన మేరకు సిమెంటు, కంకర వాడకపోవడం జరుగుతోంది. వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి పాఠశాల ప్రహరీ పునాదుల్లో ఇసుక, కంకర, సిమెంటు కలిపి బెడ్ వేయాల్సి ఉండగా.. విడివిడిగా వేయడంతో ఉపాధి హామీ పథకం ఈసీ పర్యవేక్షణ సమయంలో బయటపడింది. దీంతో గుంతల్లో బెడ్ కోసం వేసిన ఇసుక, కంకర, సిమెంటు తొలగించాలని ఆదేశించారు. కొన్ని పనులు జేసీబీతో చేయించి కూలీలతో చేసినట్లుగా రికార్డుల్లో చూపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు ఇష్టారీతిగా గుర్తించారని, అవసరం లేని చోట రోడ్డు వేస్తున్నారని బీజేపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పనుల విషయమై ఎంపీడీవో రాజేశ్వర్‌ను సంప్రదించగా.. అధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పనులకు వినియోగిస్తున్న నాణ్యత లేని ఇసుక